


# సత్యవాక్కు

సంపుటి - 43 ఆగష్టు - 2021 సంచిక - 1

## క్రైస్తవ మాసపత్రిక

ఆగష్టు - 2021

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో

శనివారం ఉదయం : 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో

ప్రతిరోజు ఉదయం : 7.30 ని॥లకు కాంతి ఛానల్‌లో

ప్రతిరోజు మధ్యాహ్నం : 3.30 ని॥లకు కాంతి ఛానల్‌లో

ప్రసంగీకులు : జాషువా గూటం

రిక్కీ గూటం

రోసీ గూటం

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

ఆగష్టు విషయ సూచిక


1. మీ పాపము మిమ్మును పట్టుకొనును -1 - పేజీ 3
2. క్రొత్తనిబంధనను అన్వయించుకొనుట - 8
3. జీవితాన్ని మార్చేసే దర్శనము - 15
4. ఆదివారముననే ఎందుకు ఆరాధించాలి? - 17
5. ప్రభువు కొరకు స్మారకం - 19
6. మారుమనస్సు పొందుడి లేదా నశించుడి - 21



**SATYAVANI**

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004. PH : 0884-2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ

ఆంధ్రప్రదేశ్ - 533 001.

ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547

ఎడిటర్: జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 43 ఆగష్టు - 2021 సంచిక -1


## మీ పాపము మిమ్మును పట్టుకొనును -1

పాతనిబంధన గ్రంథములో సంఖ్యాకాండము 32:23లో ఈలాగున వ్రాయబడి యున్నది: "మీరు అట్లు చేయనియెడల యెహోవా దృష్టికి పాపము చేసిన వారగుదురు గనుక మీ పాపము మిమ్మును పట్టుకొనును అని తెలిసికొనుడి". ఇశ్రాయేలు గోత్రముల వారగు గాదీయులతోను, రూబేనీయులతోను ఈ మాటలను మోషే పలికెను. ప్రజలు మీ పాపమును పట్టుకొందురని అతడు వారికి చెప్పలేదు గాని మీ పాపము మిమ్మును పట్టుకొనునని చెప్పెను.

మానవజాతి అంతయు పాపములో మునిగి యున్నది. ఏ భేదమును లేదు, అందరు పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని దైవవేదము ఘోషించుచున్నది (రోమా 3:23). మనలో అనేకులు బహిరంగముగా పాపము చేయుచు, పాపములో జీవించుచున్న వారున్నారు. మరి కొందరయితే రహస్యముగా పాపము చేయుచు, పాపపు భోగముల ననుభవించుచు ప్రజలకు కనబడ కుండా యున్నాము గదా యని

ఊహించుచున్నారు. అయితే దేవుని వాక్యము మాత్రము ఎన్నటికిని నిరర్థకము కాదు. మీ పాపము మిమ్మును పట్టుకొనునని తెలిసికొనుడి అని అది చెప్పుచున్నది. మనుష్యు లెవరు పట్టించి ఇయ్యక పోయినను, మన పాపము మనలను ఎట్లు పట్టుకొనునో ఈరోజు తెలిసికొందము.

మానవుడు చేసిన ప్రతి పాపము ను దేవుడు తీర్పులోనికి తెచ్చును. పాపమును బట్టబయలుచేసి దానిని శిక్షించుటయే దేవుని లక్షణమై యున్నది. దేవునికి కనబడకుండా ఈలోకములో జరిగేది ఏమియును లేదు. ఆయనకు తెలియకుండా ఏ ఒక్క చిన్న పాపమయినను దాగి యుండ గలిగిన యెడల దేవుడు దేవుడే కాదు. అయితే ఆయనకు మరుగైనది ఏదియు లేదు. దేవుడు ఎంత ఖచ్చితముగా యున్నాడో అంతే ఖచ్చితముగా ఆయన పాపమునకు తీర్పు తీర్చి శిక్షించును. ఈ విషయములో ఆయన విఫలుడగుట అసంభవము.

ప్రకృతి ఒక సాక్షి

కయీను తన తమ్ముడైన హేబెలును చంపి అతనిని రహస్యము గా పాతిపెట్టినను దేవుడు "నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలో నుండి నాకు మొర పెట్టుచున్నది" యని అతనితో చెప్పెను (ఆది 4,10). ఈ భూమి మీద నుండకుండ కయీను శపింపబడెను. కయీనుకు శిక్ష విధింపబడవలెనని హేబెలు యొక్క రక్తము నేలలో నుండి ఘోషించెను. కయీనుతో దేవుడిట్లనెను: "నీ తమ్ముని రక్తమును నీ చేతిలో నుండి పుచ్చు కొనుటకు నోరు తెరచిన యీ నేల మీద ఉండకుండ, నీవు శపింపబడిన వాడవు; నీవు నేలను సేద్యపరచు నప్పుడు అది తన సారమును ఇక మీదట నీకియ్యదు; నీవు భూమి మీద దిగులుపడుచు దేశదిమ్మరివై యుందువు" (ఆది 4:11,12).

యేసు ఒక గాడిదపిల్ల మీద కూర్చొని జయోత్సవముతో యెరూషలేములో ప్రవేశించినప్పుడు ఆయన శిష్యుల సమూహమంతయు ఆయననుగూర్చి దేవునికి స్తోత్రము చేయసాగిరి. అప్పుడు కొందరు పరిసయ్యులు దానిని చూచి,

బోధకుడా, నీ శిష్యులను గద్దింపుమనిరి. ఆయన వారిని చూచి, వీరు ఊరకుండినయెడల ఈ రాళ్ళు కేకలు వేయునని మీతో చెప్పుచున్నాననెను (లూకా 19:37-40). దీనినిబట్టి మనము గ్రహించుకొనవలసినదేమంటే మానవులు చేయు ప్రతి పాపమును పట్టియిచ్చుటకు ప్రకృతిని దేవుడొక సాక్షిగా నియమించియున్నాడు. భూమి, దానిమీదనున్న రాళ్ళు, జలములు, నిజానికి దేవుని సృష్టి అంతయు పాపమును తీర్పులోనికి తెచ్చుటకు సిద్ధపరచబడియున్నవి. అందువలననే మానవులు చేసిన ఘోరపాపమును, అంటే దేవుని కుమారుని సిలువ వేయుటను చూడలేక సూర్యుడు చీకటి కమ్మెను. ఐగుప్తులోని నీరు ఒకమారు రక్తముగా మారెను. మానవుడు దుష్టత్వములోను, పాపములోను జీవించునంత కాలము తుఫానులు, ఉప్పెనలు, భూకంపములు, మొదలగు ప్రకృతి ప్రళయములు ఎక్కువే అగును, తక్కువ మాత్రముకావు. దేవునియొక్కయు, ప్రకృతియొక్కయు చట్టము ఒకటే నీ పాపము నిన్ను పట్టుకొనును.

## పాప ఫలితము తథ్యము

మానవుల పాపములు వారినే పట్టి యిచ్చునను గొప్ప సత్యము బైబిలు గ్రంథమునందు అతి విపులముగా బోధింపబడినది. దాని విషయమై కొన్ని వచనములను ఇప్పుడు దైవగ్రంథము నుండి చదువుకొందము: "ఆజ్ఞనతిక్రమించు వారి మార్గము కష్టము" (సామెతలు 13:15). "పాపముచేయు వాడెవడో వాడే మరణించును" (యెహెజ్కేలు 18:4). "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆపంటనే కోయును" (గలతీ 6:7). "ఏలయనగా పాపము వలన వచ్చుజీతము మరణము" (రోమా 6:23) "గూఢమైన ప్రతి యంశమునుగూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతి క్రియను అది మంచిదేగాని, చెడ్డదేగాని తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12:14) "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైననుసరే దేహముతో జరిగించినవాటి ఫలమును ప్రతి

వాడును పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలెను" (2 కొరింథీ 5:10).

బైబిలు జ్ఞానము మానవులందరికి లేకపోయినను ఎవని పాపములు వానిని పట్టి యిచ్చునను సంగతిని అందరు యెరిగినదే. నరహంతకుడొకడు ఎంతో ఆలోచించి, ప్లానుచేసి హత్యచేయును. కాని అతడా నేరము చేసినచోట ఏదో ఒక చిన్న ఆధారమును, తన వేలిముద్రనో, జేబురుమాలునో, సిగరెట్టుముక్కనో విడిచి వెళ్ళును. ఆ చిన్న ఆధారమును బట్టి అతడు చివరకు పట్టుబడును. అయితే ఒక్కోసారి కొన్ని నేరములు పట్టుబడక పోవచ్చును. వాటిని పరిశోధించుచున్న మానవుల అసంపూర్ణతను బట్టి ఆ నేరస్థులు దొరుకక పోవచ్చును. అయితే ఆ నేరస్థుడు మాత్రము ఎల్లప్పుడు భయముతోనే జీవించును. ఏలయనగా ఆ మనుష్యుని యొక్కయు, ప్రతి మనుష్యుని యొక్కయు హృదయములో దేవుడు తన కొరకొక సాక్షిని నెలకొల్పియున్నాడు. దానినే మనము మనస్సాక్షి అంటూ యుంటాము. ఈ మనస్సాక్షి మానవుని, మరి ముఖ్యముగా నేరస్థుని, పాపిని యెల్లప్పుడు గద్దించుచునే యుండును. దేవుడు పరలోకములో ఎంత ఖచ్చితముగా యున్నాడో అంత ఖచ్చితముగా నీ పాపము నిన్ను పట్టుకొనును.

## నీ పాపము నిన్ను అనేక రీతులుగా పట్టుకొనును.

నీ పాపము నీ ముఖము మీదనే కనబడును. పాపముచేయు ప్రతివాడును పాపమునకు దాసుడని యేసు చెప్పెను (యోహాను 8:34). మానవుడు చేయు పాపము అతని ముఖముమీద ముద్ర వేయును. అందుకే కొందరి ముఖము చూడగానే అతడు త్రాగుబోతని, జూద గాడని, లేక దొంగయని, మోసగాడని, వ్యభిచారియని మనము ఇట్టే గుర్తించగలము. గనుక ప్రతిదినము నీవేలాగు జీవించుచున్నావో యెవరికి నీవు తెలియజేయనక్కరలేదు, నీ

ముఖమే దానిని తెలియజెప్పును. కొందరు అతి ద్వేషులు. వారి హృదయములో యున్న ద్వేషము, మత్సరము వారి కండ్లలోనే కనబడును. మానవులు చేయు శరీరకార్యములన్నియు వారి ముఖము మీదనే కనబడును. "శరీర కార్యములు స్పష్టమై యున్నవి; అవేమనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి" (గలతీ 5:19). హృదయము నిండి యుండు దానిని బట్టి ఒకని నోరు మాటలాడును. సజ్జనుడు తన హృదయమను మంచి ధననిధిలో నుండి సద్విషయములను బయటికి తెచ్చును; దుర్జనుడు చెడ్డ ధననిధిలో నుండి దుర్విషయములను బయటికి తెచ్చును (మత్తయి 12:34; లూకా 6:45).

జూదగాని యొక్క చూపులు, వదరబోతు యొక్క నోరు, త్రాగుబోతు యొక్క ముఖము ఇవన్నియు ఒకే సంగతిని బోధించుచున్నవి : నీ పాపము నిన్ను పట్టుకొనును. నీ ముఖమే నీవు చేయు పాపమును పట్టి యిచ్చును.

**అంతేకాదు, నీ శరీరములో నీ పాపము నిన్ను పట్టి యిచ్చును.**

మనుష్యుడు ఏమి విత్తునో ఆపంటనే కోయును. మానవులు చేసిన క్రియలు. అవి మంచివైననుసరే, చెడ్డవైననుసరే దేహముతో జరిగించిన వాటన్నిటికి వారు దేవుని యెదుట లెక్క అప్పగించ వలసి యున్నదని దైవవేదము చెప్పు చున్నది. హవ్వ పాపము చేయుగానే ఆ పాపవు ప్రతిఫలము తన శరీరములో ప్రతిబింబించెను. హవ్వతో దేవుడు, "నీ ప్రయాసమును, నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను. వేదనతో పిల్లలను కందువు" అని చెప్పెను (ఆది 3:26). ఆదిమ స్త్రీ-పురుషులు పాపము చేయుటవలన మానవు

లందరికి మరణము సంప్రాప్తమాయెను. మన పాపము వలన మనము కొద్ది కాలములోనే మరణించుచున్నాము. పాపమువలన శరీరము దినదినము కృశించుచున్నది. ఈ లోకములో యున్న రోగములన్నియు, వేదన అంతయు పాపము వలననేకదా. నేడు మానవులకు కలుగు అనేక రోగములను బట్టి వారెట్టి పాపములకు లోనై జీవించుచున్నారో మనము యిట్టే చెప్పగలముగదా. పొగత్రాగువారు క్షయవ్యాధితోను, త్రాగుబో . గుండె, కాలేయముల జబ్బుతోను, వేశ్యానంగులు సుఖవ్యాధులు, కుష్టు రోగముతోను బాధపడుట మన మెరిగినదే. గనుక జాగ్రత్తపడుండి! మీ పాపము మిమ్ముమ్మను పట్టుకొనును. మీ పాపము మీ శరీరములో కనబడును. నీవు అపవాదికి పనిచేసి అతడిచ్చు జీతమును పుచ్చుకొనకుండా యుండలేవు. యెవని పాపములు వానిని తరుముచు వచ్చును. నీవు పాపము నుండి పారిపోలేవు. యేసుక్రీస్తు తప్ప నిన్ను పాపము నుండి విముక్తునిగా చేయువారెవరును లేరు. గనుక ఆయన యొద్దకు రమ్ము. ఆయనే రక్షకుడని ఆశ్రయించుము. ఆయన ఆజ్ఞలకు లోబడుము. క్రీస్తుని నమ్మి బాప్తిస్మము పొందుము. నిన్ను ఆయన రక్షించును.

## క్రొత్త నిబంధనను అన్వయించుకొనుట

పాత నిబంధన ఎత్తివేయబడెనని మనం గమనించియుంటిమి. ఇప్పుడు క్రొత్తనిబంధన అధికారము చొప్పున మనము జీవించుచున్నాము. దీని ప్రభావము మన జీవితములో ఎట్లుండును? కొన్ని మతసంబంధ బోధలు పాత నిబంధనలో మాత్రమే చెప్పబడెను. వాటికి క్రొత్త నిబంధన అధికారమేమియు లేదు. అట్టి కొన్ని సాధారణ అధికారములను ఇప్పుడు పరిశీలింతము.

## సబ్బాతు దినమును ఆచరించుట

కొన్ని మతశాఖలవారు, ముఖ్యముగా సెవెంతుడే అడ్వెంటిస్టు సంఘము వారు పదియాజ్ఞలలోని నాల్గవ అజ్ఞ ఇంకను అమలులో యున్నదని చెప్పుదురు. నిర్గమ 20:8-11లో ఇట్లు చెప్పబడి యున్నది. "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవదినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను, నీ దాసుడైనను, నీ దాసియైనను, నీ పశువైనను, నీ యింఢ్లలోనున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. ఆరు దినములలో యెహోవా ఆకాశమును, భూమియు, సముద్రమును వాటిలోని సమస్తమును సృష్టించి యేడవ దినమున విశ్రమించెను. అందుచేత యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధ పరచెను". దేవుడు ఏడవ దినమందు విశ్రమించెను. దాని జ్ఞాపకార్థముగా ఆయన సబ్బాతును ప్రతిష్టించెను గనుక మనము సబ్బాతును ఆచరించవలెనని కొందరు వాదింతురు.

సబ్బాతును గూర్చిన అజ్ఞ రాతి పలకల మీద వ్రాయబడిన ఆజ్ఞలలో ఒకటైయున్నది. ఆ చట్టము అదృశ్యమగుటకు సిద్ధమైయున్నదని పౌలు చెప్పాడు. "మరణకారణమగు పరిచర్య రాళ్లమీద చెక్కబడిన అక్షరములకు సంబంధించినదియైనను మహిమతో కూడినదాయెను. అందుకే మోషే ముఖము మీద ప్రకాశించుచుండిన ఆ మహిమ తగ్గిపోవునదైనను ఇశ్రాయేలీయులు అతని ముఖము తేరి చూడలేకపోయిరి. ఇట్లుండగా ఆత్మ సంబంధమైన పరిచర్య యెంత మహిమగలదై యుండును? తగ్గిపోవునదే మహిమగలదై యుండిన యెడల నిలుచునది మరి యెక్కువ మహిమగలదై యుండును గదా" (2

కొరింథీ 3:7,8, 11). గనుక సబ్బాతును గూర్చిన అధికారము గతియించిపోయెను. సబ్బాతును ఆచరించవలెననెడి ఆజ్ఞ సీనాయి కొండ వరకు ఇయ్యబడలేదు. అప్పటి వరకు ఎవరును సబ్బాతును ఆచరించలేదు.

"సీనాయి పర్వతము మీదికి దిగి వచ్చి ఆకాశమునుండి వారితో మాటలాడి వారికి నీతియుక్తమైన విధులను సత్యమైన ఆజ్ఞలను మేలు కరమైన కట్టడలను ధర్మములను నీవు దయచేసితివి. వారికి నీ పరిశుద్ధమైన విశ్రాంతి దినమును ఆచరింప నాజ్ఞ ఇచ్చి నీ దాసుడైన మోషే ద్వారా ఆజ్ఞ లను కట్టడలను ధర్మశాస్త్రమును వారికి నియమించితివి" (నెహెమ్యా 9:13, 14). సబ్బాతును గూర్చిన ఆజ్ఞను దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయు లకు సీనాయి కొండకు దిగివచ్చి యిచ్చినట్లు నెహెమ్యా పరిశుద్ధాత్మ వలన చెప్పుచున్న దానిని గమనించుము. లేని చట్టమునకు ఎవడును విధేయుడు కానేరడు. ఇంకా ఆదిమ క్రైస్తవుల వ్రాతలను బట్టి ఆదిమ సంఘము దేవుని నారాధించుటకు వారములో మొదటి దినమున అనగా ప్రతి ఆదివారమున కూడుకొను చున్నట్లు తెలిసికొనగలము.

## వాద్య సంగీతము

ఇంచుమించు అన్ని మతశాఖల వారు ఆరాధనలో వాద్యములనుపయో గింతురు. దైవారాధనలో వాద్యసంగీత మునుపయోగించుటకు క్రొత్త నిబంధనలో ఎక్కడా అనుమతి కనబడదు. సరిగదా పాటలు పాడవలె నని కనబడ్తాది. పాతనిబంధనలో వాద్యములనుపయోగించవలెనని చెప్పబడెను, నిజమే. అయితే నేటి మన ఆచరణ నిమిత్తము పాతనిబంధనను సరింపరాదు. బూరలు, వీణలు మొ॥గు వాటిని గూర్చి ప్రకటన గ్రంధము చెప్పుచున్నది. అవి దేవుని ఆరాధనలో ఉపయోగించినట్లు మాత్రము చెప్పబడలేదు. సరిగదా ప్రకటన గ్రంథమంతయు అలంకార రూపక భాషలో వ్రాయబడెను. పరలోకమే

ఆత్మీయమైనది. అది భూ సంబంధముకాదు. గనుక భౌతిక సంబంధమైన వాద్యములు ఆత్మీయ ప్రదేశములో ఎట్లుండును? ఎందుకు వుండును? ఆత్మీయ సంగతులలో క్రొత్త నిబంధన మన మార్గదర్శియై యున్నది. క్రొత్త నిబంధన ఆరాధనలో వాద్యము లనుపయోగించుటకు దాని పుస్తకము లలో ఎక్కడా అనుమతి లేదు.

## దశమ భాగము

మతశాఖల వారందరు తమ సభ్యులు పదియవ వంతు కానుక లీయవలెనని ఆజ్ఞాపింతురు. పాత నిబంధనలో తమ ఆదాయములో దశమ భాగము దేవునికీయాలని ఆజ్ఞాపింపబడినది. "భూ ధాన్యములలో నేమి, వృక్ష ఫలములలోనేమి భూ ఫలములన్నిటిలో దశమ భాగము యెహోవా సొమ్ము. అది యెహోవాకు ప్రతిష్టితమగును" (లేవీ 27:30).

పాత నిబంధనాచార ప్రకారము నేడు క్రైస్తవులు కూడ తమ ఆదాయ ములో దశమ భాగము నీయాలని అనేకులు బోధింతురు. "నేను వచ్చి నప్పుడు చందా పోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడు తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింథీ 16:2). ఇక్కడ క్రైస్తవులు కానుకలిచ్చు ఆజ్ఞయున్నది. తాను వర్ధిల్లిన కొలది ఇయ్యవలెనని పౌలు చెప్పుచున్నాడు. ఎంత ఇయ్యవలెనో విశదీకరించలేదు. అనగా మనము తక్కువ ఇయ్యాలని దీని యర్థము కాదు. ఒక బలహీనమైన నిబంధనలో యున్న ఇశ్రాయేలీయులు దశమ భాగము ఇయ్యాలని ఆజ్ఞాపింపబడితే దానికంటే శ్రేష్టమైన నిబంధన క్రింద యున్న మనము కనీసము అంత అయినా ఇయ్యాలి. గనుక దశమ భాగముతో అరంభించాలి. సణుగు గొనక యు బలవంతముగా కాకయు ఒకడు తన హృదయములో నిశ్చయించు కొనిన ప్రకారము ఉత్సాహముగా ఇయ్యవలెనని పౌలు ఆజ్ఞాపించు చున్నాడు (2 కొరింథీ 9:7,8). ఇంత ఇయ్యవలెనని ఒకడు

ఆజ్ఞాపింపబడి నప్పుడు, అది అతనిలో ఉత్సాహాన్ని కలిగించదు; ఇష్ట పూర్వకముగా ఇయ్యలేదు. ఉత్సాహ పూర్వకముగా ఇయ్యని కానుక యుంటే మనం పొంద వలసిన దీవెనలను పొందము.

## నేరుగా దేవునికే ప్రార్థించుట

పాత నిబంధన ప్రకారము ఒకడు దేవుని ఆరాధించాలంటే అతడు యాజకుని ద్వారా ఆ పని జరిగించాలి. ప్రజలు జంతుబలుల నర్పించా... కాని నిజానికి అర్పించే వాడు యాజకుడు. ఆరాధనలో సాంబ్రాణి పొగ లనర్పించేవాడు యాజకుడే. ఇంకొక మాటలో ఆరాధకునికి (మానవునికి) దేవునికి మధ్య యాజకుడు ఉండేవాడు.

క్రొత్త నిబంధనలో అయితే మానవుడు నేరుగా దేవుని సమీపించ గలడు. ఇప్పుడు దేవుని సన్నిధికి చేరు కోవాలంటే భూసంబంధ యాజకు డెవరు లేరు. ఏలయనగా మనందరము పరిశుద్ధమైన యాజకులమే. ఆత్మ సంబంధ బలుల నర్పించుటకు క్రైస్తవు లందరు యాజకులే (1 పేతురు 2:5). మనం జంతు బలుల నర్పింతుము. మనము మన శరీరములను సజీవ యాగముగా దేవునికి అర్పింతుము. "కాబట్టి సహోదరులారా, పరిశు ద్ధమును దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుడని మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది" (రోమా 12:1). "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతి యాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వా ఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15).

మనము బలుల నర్పింతుము గాని ఆ బలులు ఆత్మీయ బలులు. పాత నిబంధన యాజకులు దేవునికి సాంబ్రాణి ధూపములనర్పించాలని ఆజ్ఞాపింబడిరి (నిర్గమ 30:8). నేడు కూడ మనము ధూపార్పణము

చేతుము గాని అదే మన ప్రార్ధనలు గాని సాంబ్రాణి పొగల నర్పించము ప్రార్ధనలు చేతుము. "ఆయన దానిని తీసికొనినప్పుడు ఆ నాలుగు జీవులును, వీణెలను ధూపద్రవ్యము లతో నిండిన సువర్ణ పాత్రలను పట్టు కొని యున్న ఆ యిరువది నలుగురు పెద్దలును ఆ గొర్రెపిల్ల యెదుట సాగిల పడిరి. ఈ పాత్రలు పరిశుద్ధుల ప్రార్ధనలు" (ప్రకటన 5:8). ఆరాధన లో ఆత్మీయ సంగతులకే ప్రాధాన్యత యున్నట్లు గమనించుము మరియు ప్రతి క్రైస్తవుడు నేరుగా దేవుని సమీపించ గలడు. ఒక మానవ మాత్రుడైన యాజకుడు అవుసరము లేదు.

## సున్నతి

శారీరక సున్నతి పొందుట పాత నిబంధన యొుక్క గురుతుగా యుండెను. యూదులలో పుట్టిన ప్రతి మగవాడును నిబంధన సంబంధ గురుతుగా సున్నతి పొందవలసి యుండెను. క్రైస్తవులకు కూడ సున్నతి యున్నది గాని అది ఆత్మీయమైనది. అది హృదయ సంబంధమైన సున్నతి. "మీరును క్రీస్తు సున్నతియందు శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి ఆయన యందు చేతులతో చేయబడని సున్నతి పొందితిరి" (కొలస్స 2:11). ఈ సున్నతిని ఆత్మీయ సున్నతి యని పౌలు చిత్రీకరించుట గమనించుము. అది చేతులతో చేయబడలేదు. భౌతిక శారీరక సున్నతియైతే పాత నిబంధనలో చేతులతో చేయబడెను. ఆత్మీయ సున్నతి యనగా శరీర సంబంధమైన పాపములను విసర్జించుటయే. "అయితే అంతరంగమందు యూదుడైన వాడే యూదుడు మరియు సున్నతి హృదయ సంబంధమైనదై ఆత్మయందు జరుగునదే గాని అక్షరము వలన కలుగునది కాదు. అట్టి వానికి మెప్పు మనుష్యులవలన కలుగదు, దేవుని వలననే కలుగును" (రోమా 2:29). మరల "యేసుక్రీస్తు నందుండు వారికి సున్నతి పొందుట యందేమియులేదు, పొందకపోవుట యందేమియు లేదు గాని ప్రేమ వలన

కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజన కరమగును" అని అపో.పౌలు వ్రాసాడు (గలతీ 5:6).

బాప్తిస్మమును నిబంధనకు గురుతుగా కొందరు చూపించ ప్రయత్నిస్తారు గాని దానిని పౌలు అట్లు చెప్పలేదు. గాని "మీరు బాప్తిస్మ మందు ఆయనతో కూడ పాతిపెట్ట బడిన వారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి"యని అతడు కొలస్స 2:12లో చెప్పాడు. మనము బాప్తిస్మము నీటిలో పాతిపెట్టబడినప్పుడు ఆత్మీయ సున్నతి సంభవించును. అయితే బాప్తిస్మము సున్నతి కాదు. గాని దేవుడు మనలను ఆత్మీయముగా శుద్ధిచేసి, మన పాపము లను క్షమించుసమయమది. క్రొత్త నిబంధనకు గురుతుగా బాప్తిస్మము ఎన్నడు, ఎక్కడా చెప్పబడలేదు. సరిగదా పరిశుద్ధాత్మునిలో మనము ముద్రింపబడియున్నాము (ఎఫెసీ 4:30).

## ముగింపు

బైబిలు ఆధారములేని కొన్ని పద్ధతులను మతశాఖల వారు ఆచరించు వాటిని క్లుప్తముగా మనము చూచుకొనియున్నాము. ప్రజలు పాత క్రొత్త నిబంధనల సంబంధము నెరుగ నందున చాలమట్టుకు ఈ గందర గోళము ఉద్భవించినది. పాత నిబంధనలో ఆచరింపబడిన, క్రొత్త నిబంధనలో ఆచరింపబడని కొన్ని ఆచారములను కూడ మనము గమనించాము. ఇంకా కొన్ని తేడాలను మీరే గుర్తించగలరు. దేవుని పరిచర్యలో మనము చేయు దానికి దేవుని అనుమతియున్నదో లేదో మనం పరీక్షించుకోవాలి. ఆయధికారము క్రొత్త నిబంధనలో మాత్రమే మనకు లభించును. ఈ పాఠములు నిబంధ నల సంబంధమును మీరు మరింత గ్రహించుకొనునట్లు సహాయపడెన నియే నా విశ్వాసము. దానిని గ్రహిస్తే మీరు సత్యవాక్యమును సరిగ విభజించగలరు (2తిమోతి 2:15).

- జెర్రీ బేట్స్

# జీవితాన్ని మార్చేసే దర్శనము

మీ బైబిలును యెషయా 6వ అధ్యాయమునకు తెరువుము. యెషయా యొక్క మాటలలో దేవుని గూర్చి మనం అర్ధంచేసికొనే సంగతులున్నాయి. ఆ అధ్యాయములో అతడు చూచిన దర్శనము వలన అతని ఆలోచనలు, బోధలో గొప్ప మార్పు సంభవించినది. ఆ దృశ్యమే మన జీవితాలను కూడా మార్చివేయును. "రాజైన ఉజ్జియా మృతినొందిన సంవత్సరమున అత్యున్నతమైన సింహాసనమందు ప్రభువు ఆసీనుడై యుండగా నేను చూచితిని. ఆయన చొక్కాయి అంచులు దేవాలయమును నిండుకొనెను. ఆయనకు పైగా సెరాపులు నిలిచి యుండిరి, ఒక్కొక్కనికి ఆరేసి రెక్కలుండెను. ప్రతివాడు రెండు రెక్కలతో తన ముఖమును రెంటితో తన కాళ్లను కప్పుకొనుచు రెంటితో ఎగురు చుండెను" (యెషయా 6:1-3).

ఉజ్జియా రాజు చనిపోయాడు. యెషయా అతని గూర్చి దు:ఖించాడు. ఈ భూసంబంధమైన రాజు మీద యెషయా తన ఆశలు నిలుపుకున్నాడు. అయితే ఇశ్రాయేలు యొక్క నిజమైన రాజు ఎవరో యెషయాకు దేవుడు తెలియజేయ నిశ్చయించుకొన్నారు. ఆయన తన పరిశుద్ధతను, ప్రభావమును యెషయాకు తన్నుతాను బయలు పర్చారు. ఆ దృశ్యాలు యొక్క ప్రభావము మూడు మాటలలో చెప్పుకొనవచ్చును.

యెషయా "అయ్యో నేను అపవిత్రమైన పెదవులు గలవాడను" అన్నాడు (యెషయా 6:5). దేవుని యొక్క పరిశుద్ధతను చూచి ప్రవక్త తన అపవిత్రతను గూర్చి సిగ్గుపడ్డాడు. అతడు మాటలు లేని వాడయ్యాడు. నశించిపోయాననుకొన్నాడు. దేవుని యొక్క గంభీరప్రభావమును చూచి చచ్చినవాడననుకొన్నాడు.

ఎవడైతే తాను పాపినని తలంచాడో అతడు దేవుని శక్తిని చూడ

లేదు. నీ జీవితాన్ని యేసుకు విరుద్ధ ముగా మల్చుకొనిన యెడల యెషయా వలె ఘోషిస్తావు. సీమోను పేతురు వలె "ప్రభువా, నన్ను విడిచి పొమ్ము; నేను పాపాత్ముడనని" ఒప్పుకొంటావు (లూకా 5:8).

అప్పుడు సెరాపులలో ఒకడు బలిపీఠము నుండి కారుతో తీసిన నిప్పును యెషయాకు తగిలించి "ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ పాపముకు ప్రాయశ్చిత్తమాయెనని" చెప్పెను (యెషయా 6:7). దేవుడు పాపిని కాదుగాని పాపమును నాశనము చేయగోరుచున్నారు. కాలుచున్న నిప్పును పెదవులకు తగిలించుట, యేసుక్రీస్తు యొక్క రక్తమునకు గురుతుగా యున్నది. హృదయము మలినమై యున్నందున పెదవులు అపవిత్రమైనవి. ఏ మానవుడు కల్మష హృదయముతోను, అవిత్రమైన పెదవులతోను జీవించ నవుసరంలేదు. దేవుడు తన పరిశుద్ధ తలో క్రీస్తురక్తము వలన మనలను శుద్ధిచేయును. నీవు క్షమించబడ గలవు, పునరుద్ధరింపబడగలవు, పవిత్ర పరచ బడగలవు.

దేవుడు "నీవు పోయి ఈ జనులతో ఇట్లనుము" అని యెషయాకు చెప్పారు. అతని పాపము పరిహరింపబడిన వెంటనే ప్రజలకొక వర్తమానికుని కొరకు పంపుమని చెప్పారు "నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడుపోవును"? అని దేవుడన్నారు (6:8). తన జీతభత్యాల కొరకేమి ఆశించకుండా యెషయా నేనున్నాను, నన్ను పంపుమని చెప్పెను. అపవిత్ర హృదయము తన కొరకే ఆలోచించుకొనును. అయితే హృదయము శద్ధిచేయబడగా అది యితరులను గూర్చి ఆలోచిస్తాది. ఒకని పెదవులు పవిత్రపరచబడగా, అవి దేవుని గూర్చి మాట్లాడతాయి.

దేవుడు నీవు వెళ్లుము అని చెప్పారు గాని కొందరే వింటారని ఆయన యెషయాకు హెచ్చరిక చేసారు. అప్పుడు యెషయా, "ప్రభువా ఎన్నాళ్లవరకని నేనడుగగా ఆయన నివాసులు లేక పట్టణములును

మనుష్యులు లేక యిండ్లును పాడగు వరకు, దేశము బొత్తిగా బీడగు వరకు నని" సెలవిచ్చెను (6:11). వినడానికి ప్రజలున్నంత వరకు నీవు వారికి చెబుతూనే యుండు. కావలసినవారమై మనం పరిచర్యచేయము గాని మనం అవుసరమైన పరిచర్య చేతుము. మనం అవుసరమైన వారమైనందున దేవుని వాక్యాన్నిచే బట్టుదుము. మనకు విజయం గ్యారంటీ చేయబడినందున వాక్యాన్ని చేపట్టుటలేదు. అదంతా ఎందుకు చేస్తామంటే ఆయన "వెళ్లి బోధించు" అని చెప్పారు. పవిత్ర హృదయము విధేయతగలది, ఎక్కువ కాలముండునది.

యెషయా దేవునినే చూచాడు, మరియు అవుసరంలో యున్న లోకాన్ని చూచాడు. రక్షించే కృప దేవుని నుండి కలుగును. అది మన జీవితాలను తాకును. మన ద్వారా యితరులను తాకును. యెషయా చూచిన దర్శనం అతని నెట్లుమార్చెనో అది అట్లే మనలను కూడ మార్చును.

డబ్ల్యు.టి.ఆలిసన

## ఆదివారముననే ఎందుకు ఆరాధించాలి?

క్రైస్తవులు సంఘముగా కూడి ఆదివారమున ఆరాధింతురు ఏలయనగా ఆ దినమందు కొన్ని ప్రత్యేక ప్రాముఖ్య సంగతులు జరిగెను.

వారములో మొదటి దినమున యేసు మృతులలో నుండి సజీవుడై లేచెను (మార్కు 16:9). "ఆదివారమున తెల్లవారినప్పుడు యేసు లేచి తాను ఏడుదయ్యములను వెళ్లగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను" అని అక్కడ వ్రాయబడి యున్నది.

ఆదివారమున పరిశుద్ధాత్ముడు అపొస్తలులపై కుమ్మరించబడెను. "పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడి యుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలి వంటి యొక ధ్వని ఆకాశము నుండి అకస్మాత్తుగా వారు

కూర్చుండియున్న ఇల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలల వంటి నాలుకలు విభాగింపనట్లుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగా అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడ సాగిరి" (అపో. 2:1-4).

పెంతెకొస్తు అనగా 50వ దినము అని అర్థము. అది యూదుల ధర్మశాస్త్ర ప్రకారము ఆచరించబడే ఒక ప్రత్యేక పండుగదినము. అది పస్కా పండుగ అనంతరము 50 దినముల తరువాత ఆచరించబడాలి. అది "విశ్రాంతి దినమునకు మరుదినమున" ఆచరింపవలెను (లేవీ 23:11, 15). గనుక అపొస్తులులు పరిశుద్ధాత్మను పొందిన దినము, సువార్త ప్రకటించుటకు మొదలిడిన దినము ఆదివారము. ఏలయనగా పెంతెకొస్తు ఎప్పుడు ఆదివారముననే వచ్చును.

ప్రభువైన యేసుక్రీస్తు సంఘము ఆ దినముననే ఆరంభమాయెను. క్రీస్తు నామమున రక్షణను అపొస్తులులు ప్రకటించుట కారంభింపగా, ప్రజలు మారుమనస్సు పొంది క్రీస్తులో బాప్తిస్మము పొందిరి (అపో.కా. 2:3-42). వారందరు ఏకముగా సహవాసముగా చేర్చబడి లోకమంతయు సువార్త చాటుట కారంభించిరి. క్రొత్త నిబంధనలో ఆ క్షణము నుండి సంభవించిన మార్పును గమనించవచ్చును. క్రీస్తు సంఘము స్థాపింపబడియుండెను!

ప్రభురాత్రి భోజనములో పాలు పొందు నిమిత్తము క్రీస్తుసంఘము ప్రతి ఆదివారమున కూడుకొనుచుండిరి (అపో.కా. 20:7). "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లనైయుండి అర్ధరాత్రివరకు విస్తరించి మాటలాడుచుండెను" (అపో.కా. 20:7).

ఈ స్థానిక సంఘములు ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనుట యే గాక వారికి అదనపు హెచ్చరికలు ఈయబడెను. వారు ప్రతి ఆదివారమున చందాపోగుచేయవలెనని హెచ్చరిక చేయబడిరి (1

కొరింథి 16:1,2). వారు ఒకరినొకరు హెచ్చరించుకొనవలెనని చెప్పబడెను (హెబ్రీ 10:25).

యూదులు సబ్బాతునాచరించుట సరియే గాని క్రొత్తనిబంధన క్రైస్తవులుకీయబడెను. సరిగదా వారు మోషే ధర్మశాస్త్రము నాచరింపవలదని ప్రత్యేకముగా హెచ్చరిక చేయబడిరి (రోమా 7:1-6). ఆ ధర్మశాస్త్రము నెరవేర్చబడి సిలువకు మేకులతో కొట్టబడెను (ఎఫెసీ 2:14-16; కొలస్స 2:14). క్రైస్తవులు క్రీస్తును వెంబడిస్తారు. వారు క్రొత్త నిబంధన నుసరిస్తారు (హెబ్రీ 8:6-8). ఈ క్రొత్త నిబంధనను బట్టి ఆదిమ క్రైస్తవులు ఆదివారమున ఆరాధనకు కూడుకొనుచుండిరి. అది వారములో మొదటి దినము అది ప్రభువు దినము!

-కెన్‌టేలర్

## ప్రభువు కొక స్మారకం

విగ్రహములు, సమాధులు, రాతిపలకలు మొదలగునవి గతంలో మ[illegible]ంచినవారి యొక్క స్మారకములు. ప్రభు[illegible] భోజనము కూడ ఒక స్మారక[illegible]హ్నమే. "పిమ్మట ఆయన యొక[illegible] పట్టుకొని కృతజ్ఞతా స్తుతులు చెల్లించి దానిని విరిచి వారికిచ్చి ఇది మీ కొరకు ఇయ్యబడు చున్న నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన తరువాత ఆయన గిన్నెయు పట్టుకొని ఈ గిన్నె మీ కొరకు చిందింప బడుచున్న నా రక్తము వలనైన క్రొత్త నిబంధన" (లూకా 22:19,20). "మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగునపుడెల్లా ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురింతురు" (1కొరింథీ 11:26). గనుక ప్రభురాత్రి భోజనములో ఒక క్రైస్తవుడు పాల్గొనునపుడెల్లా అతడొక స్మారక విందులో పాలుపొందు చున్నాడు.

పస్కా ప్రభురాత్రి భోజనము యొక్క ఛాయయైయుండెను. ఇశ్రాయేలీయుల ఐగుప్తు బానిసత్వము నుండి విడుదలపొందిన దానికి స్మారకముగా పస్కాను ఆచరించిరి (నిర్గమ 11:1-8; 12:25-27, 46). "క్రీస్తు అను మన పస్కాపశువు వధింప బడెను" అని అపొ.పౌలు చెప్పాడు (1 కొరింధీ 5:7). పాప బంధకముల నుండి విడుదల పొందుటకు గాను యేసు యొక్క బలి మార్గమాయెను (ఎఫెసీ 1:7). ఆయన మన పస్కా అయినందున ఆయన ఎముకలలో ఒకటియు విరుగగొట్టబడలేదు (యోహాను 19:31-36).

ఈ స్మారక విందులో రెండు అంశములున్నాయి, రొట్టె - ద్రాక్షా రసము (మత్తయి 26:26-28; మార్కు 14:23-25). రొట్టె యై సహజముగా పులియని రొట్టె యుండును. ఏలయనగా పస్కా భోజనమైన తరువాత ప్రభువు దీనిని ప్రతిష్ఠించారు. (నిర్గమ 12:15). "అది పులియని రొట్టెల పండుగలో మొదటి దినమందు..." అని మత్తయి తెలియ జేయుచున్నాడు (మత్తయి 26:17). అప్పుడు యేసు "ఇది నా శరీరము" అని చెప్పెను.

ప్రభురాత్రి భోజనమును ప్రతి ఆదివారమున ఆచరించవలెను. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లనై యుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడు చుండెను" (అపొ.కా.20:7). పౌలు త్రోయలో ఆరు దినములుండెను" అయినను శిష్యులు ప్రభువు దినమున అనగా ఆదివారమున సంఘముగా కూడుకొనిరి. అది యేసు యొక్క పునరుత్థాన దినము (మార్కు 16:9; అపొ.కా.2; లేవీ 23:15-16).

"సబ్బాతు దినమును పరిశు ద్ధముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచు కొనుము" అని ప్రభువు చెప్పినపుడు (నిర్గమ 20:8), అది ప్రతి సబ్బాతు దినమున అని యూదులు గ్రహించు కొనిరి. "నేను వచ్చినప్పుడు

చందా పోగు చేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" అని పౌలు చెప్పినప్పుడు, అది ప్రతి ఆదివారమున యని మన మెరుగుదుము (1 కొరింధీ 16:2).

ఆదివారమున జీతము ఇచ్చెదనని యజమాని చెబితే అది ప్రతి ఆదివారమున యని మనం గ్రహించు కొందుము. అట్లయినప్పుడు ప్రభురాత్రి భోజనము నాచరించుటకు సంఘము ప్రతి ఆదివారమున కూడుకొనెనని మనం ఎందుకు గ్రహించుకొనలేము? మన పాప పరిహారనిమిత్తము ప్రభువు చేసిన బలియాగమును జ్ఞాపకముంచుకొను నిమిత్తము ప్రతివాడు ఆదివారమున కూడుకొనవలెను.

- గేరీ హాంప్టన్

## మారు మనస్సు పొందుడి లేదా నశించుడి

మారు మనస్సును గూర్చిన ఆవశ్యకతను తెలియజేయడానికి బోధకులు పై మాటలను తరుచు వినియోగిస్తారు. మార్పుజెందుటలో పాపము నుండి ఒకడు వైదొలగాల నుటలో సందేహము యేమీలేదు (అపో.కా. 17:30, 31). మనం నమ్మి ఆచరించు ప్రతిదానికి లేఖనముల అధికారముండ వలెననునది నిస్సందేహము (1 థెస్స 5:21). ఈ సందర్భములో లూకా 13: 1-5ను గమనించుదము :

"పిలాతు గలిలయుల కొందరి రక్తము వారి బలులతో కలిపి యుండెను. ఆ కాలమున అక్కడ నున్న కొందరు ఆ సంగతి యేసుతో చెప్పగా ఆయన వారితో ఇట్లనెను: ఈ గలిలయులు అట్టి హింస పొందినందున, వారు గలిలయులందరికంటె పాపులని మీరు తలంచుచున్నారా? కాదని మీతో చెప్పుచున్నాను; మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు. మరియు సిలోయములోని గోపురము పడి చచ్చిన ఆ పదునెనిమిది

మంది యెరూషలేములో కాపురమున్న వారందరి కంటే అపరాధులని తలంచుచున్నారా? కారని మీతో చెప్పుచున్నాను; మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును అలాగే నశింతురు" (లూకా 13:1-5).

ఇదియు, మరికొన్ని లేఖన భాగములును మనము తప్పక ఉద్ఘాటించాలి. రక్షణ సంకల్పములో ఈ అంశమును ఉపదేశించాలి. ఈ ప్రత్యేక సందర్భములో యేసు జనసమూహమునకు ఉపదేశించుచున్నారు (లూకా 12:1, 1వ.వ). వేషధారణను గూర్చి ఆయన చేసిన ఉపదేశము ఈ భాగములో యున్నది. ధనాశను గూర్చి, లోభత్వమును గూర్చి మెళకువగా యుండుటను గూర్చి, సంభవింపబోవు విషాదమును గూర్చి (లూకా 12:49-59), మారుమనస్సును గూర్చి ఆయన బోధించారు (లూకా 13:1-9). మొదటి వచనములో లేఖనములలో లేని సంఘటన గూర్చి లూకా వ్రాసాడు. ఆందోళనలు, తిరుగుబాటులు, ఆరోజులలో సహజముగా జరిగేవి. పిలాతు యొక్క దుష్టత్వము ఇక్కడ చెప్పబడినది. చంపబడినవారు పాపులని పెక్కుమంది యూదులు తలంచేవారు. మేము వారి కంటే నీతిమంతులమని తలంచేవారు.

అట్టి అసత్యభావములను గూర్చి యేసు ముందుగనే బోధించారు (యోహాను 3:9). ప్రభువు సిలోయము గోపురము కూలి చనిపోయిన 18 మందిని గూర్చి కూడా చెప్పారు. మారుమనస్సును గూర్చిన ప్రాముఖ్యతను బోధించడానికి యేసు ఈ రెండు ఉదాహరణలను వారికి చూపించారు. ఇశ్రాయేలు మారు మనస్సు పొందాలి (మత్తయి 4:17). నలుబది సంవత్సరముల తరువాత యెరూషలేము నాశనమగుటలో కూడా ఇశ్రాయేలీయులకు మారుమనస్సు అవుసరం. గనుక మనమును మారుమనస్సు పొందని యెడల నశించెదము. చారిత్రాత్మక వాస్తవములను బట్టి మారుమనస్సు పొందని యెడల మనము కూడా నశించెదమని గమనించాలి.

-డెన్నిస్ గుల్లెడ్జ్

# సంక్షిప్తవార్తలు

2021 ఆగష్టు సంచికతో సత్యవాక్కు మాసపత్రిక 43వ సంవత్సరములో ప్రవేశించినది. గత నాలుగు దశాబ్దాలకు పైగా ఈ పత్రిక నిరాటంకముగా కొనసాగించుటకు శక్తిని, సామర్థ్యమును, ఆరోగ్యమును అనుగ్రహించిన దేవునికి స్తుతులు స్తోత్రములు. 1980లో ఈ పత్రిక ఆగష్టు నెలలో మొదటిగా 800 మంది పాఠకులతో ప్రారంభించబడెను. ఇప్పుడు అది 10,500 మందికి ప్రతి నెలా అందజేయబడుచున్నది. ఇన్ని సంవత్సరముల మట్టుకు నిరాటంకముగా ఏకధాటిగా నడుపబడిన క్రైస్తవ మాసపత్రిక సత్యవాక్కు మాత్రమేనేమో!

2021 జూలై 6వతేదీన రిక్కీగూటం గారు, జస్టిన్ గూటం గారు అమెరికా నుండి క్షేమముగా స్వదేశమునకు స్వగృహమునకు చేరుకొనిరి. జూలై 6వ తేదీ సాయంత్రము నుండి రిక్కీగారు వివిధప్రాంతములలో సువార్త చాటుటకు ఆరంభించిరి.

2021వ సంవత్సరం మొదటి నుండి విశాఖ జిల్లా చింతపల్లి ఏరియాలో యున్న క్రీస్తు సంఘములను అభివృద్ధి చేయుటకు అవసరమైన చోట ఆలయములను నిర్మించుటకు రిక్కీగూటం గారు పూనుకొన్నారు. గూడెం మండలం బోనంగి పల్లిలోను, చింతపల్లి మండలం మూలగరువులోను ఆయన ఆలయములను నిర్మించుటకు సహాయపడిరి.

2021 జూలై 14వ తేదీన ఉదయం బోనంగి పల్లిలో నిర్మించబడిన ఆలయమును రిక్కీగారు ప్రార్థన పూర్వకముగా ప్రారంభించి ప్రతిష్టించిరి. అక్కడ కె. అప్పన్న గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. అనేకమంది సంతోషముతో ఆ కార్యక్రమములో పాల్గొనిరి. అక్కడ నుండి రిక్కీగారు, అలెగ్జాండర్ కేంబల్ గారు, ఇంచుమించు 20 మంది సువార్తికులు మోటర్‌సైకిళ్ల మీద ర్యాలీగా మూలగరువు చేరుకొని అక్కడ నిర్మించబడిన ఆలయ[illegible]ను మధ్యాహ్నపు వేళ ప్రతిష్టించిరి. మూలగరువులో అలెగ్జాండర్ కేంబె[illegible] గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

జూలై 17వ తేదీ శనివారం ఉదయం సత్యవాణి క్రీస్తుసంఘములో కూడుకొనిన వందమందికి పైగా సువార్తికులకు స్థానిక ఎమ్.ఎల్.ఎ. శ్రీ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గారి చేతులమీదుగా రేషన్‌కిట్లు, కొంతమందికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు ఉచితముగా అందచేసిరి. అదేరోజు మధ్యాహ్నం

వ్యవసాయ సహకారశాఖమాత్యులు శ్రీ కురుసాల కన్నబాబు గారి చేతులమీదుగా వందలాది బోధకులకు రేషన్‌కిట్లు, అక్సిజన్ యంత్రములు ఉచితముగా అందజేసిరి. ఆక్సిజన్ యంత్రముల విలువ మొత్తము 25లక్షల రూపాయలవరకు యుండును. యివి కోవిడ్ బాధితులకు 250 గ్రామముల మట్టుకు సహాయపడును. ఈ ప్రత్యేక సందర్భమును స్థానిక టి.వి.లలోను, ఈనాడు, సాక్షి పేపర్లలోను ప్రముఖముగా ప్రచురించడమైనది. తద్వారా క్రీస్తుకు ఆయన సంఘమునకు గొప్ప మహిమ కలిగెను.

ఇప్పుడే అందిన వార్త : అమెరికాలో కాపురముంటున్న రోనీగూటం, హరిత గూటం దంపతులకు అమెరికా కాలమాన ప్రకారము 2021 జూలై 22వ తేదీ మధ్యాహ్నం 3:21 నిమిషములకు కుమార్తె జన్మించినది. తల్లి బిడ్డ క్షేమముగా యున్నారు. ఆమెకు ఏడిలిన్ ఈవ గూటం అను నామకరణం చేయబడినది.7


**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ: ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్, ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004